క్లుప్తంగా

నేడు ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సీపీఐ రాష్ట్రవ్యాప్త ఆందోళన లో భాగంగా శుక్రవారం జిల్లాలోని తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహిస్తున్న ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికిరూ. 5 లక్షల ఆర్థిక సహాయం, భూమిలేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని కోరుతూ ఈ ఆందోళన నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలపై దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కో–ఆర్డినేటర్ బండి జకరయ్య పేర్కొన్నారు. అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నగరంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ నరసింహులు, అబ్దుల్ సత్తార్, మల్లెం విజయభాస్కర్, సంజయ్ కాంత, కుళ్లాయప్ప, సునీల్, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడపలోనే ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని ఉంచాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12న ఉదయం 10 గంటలకు కడప నగరంలోని ఐఎంఏ హాల్లో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో జరగబోయే సదస్సు జయప్రదం చేయాలన్నారు. రాయలసీమ నడిబొడ్డున ఉన్న ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపును ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాల్సి ఉందన్నారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం అంటే రాయలసీమ ప్రజలంటే పాలకులకు లెక్కలేనితనమే కారణమన్నారు.

ఫాతిమా షేక్ వర్ధంతి, జయంతి ప్రభుత్వమే నిర్వహించాలి



ఫాతిమా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆప్‌కీ ఆవాజ్ సభ్యులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఆధునిక భారత్‌లో తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి, వర్ధంతి సభలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాష పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో ఫాతిమా షేక్ 194వ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ షాజహాన్, సయ్యద్ చాన్ బాష, స్థానిక నాయకులు బాబ్జాన్, ఇమ్రాన్, అల్లాబకాస్, ఎస్ఎస్ షంషీర్, రమణ, జిలాన్ పాల్గొన్నారు.

గండికోటలో స్టూడియో నిర్మించాలి



గండికోట పోస్టర్ ఆవిష్కరిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

కడప కల్చరల్ : గండికోటలో సినిమా స్టూడియో నిర్మించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. గురువారం స్థానిక పీవీఆర్ గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్‌రెడ్డి, సరస్వతమ్మ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో గండికోట ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటలోని క్యానియన్ ఫోటోలను ఆవిష్కరించారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి , పోతుల వెంకట్రామిరెడ్డి , రాయలసీమ టూరిజం సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, లయన్ జోజిరెడ్డి, కేవీ రమణారెడ్డి, రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఆదిత్య



కడప కార్పొరేషన్ : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య కలిశారు. తనను యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

వైకుంఠ దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు



ప్రత్యేక ఆకర్షణగా దేవతామూర్తులు



వేడుకలకు ముస్తాబవుతున్న దేవుని కడప ఆలయం



దేవుని కడప ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బారికేడ్లు

కడప కల్చరల్ : వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి సందర్భంగా వైష్ణావాలయాలలో శుక్రవారం ఉత్తర ద్వార దర్శనానికి నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్ని వైష్ణవాలయాలలో ఇప్పటికే వైకుంఠ ద్వారాలు ఉన్నచోట వాటికి పూలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకారం చేశారు. ఆ ద్వారం నుంచి స్వామిని దర్శించుకునేందుకు బారికేడ్ల క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉత్తర ద్వారాలు లేనిచోట ప్రత్యేకంగా అలంకారిత సెట్టింగ్ ద్వారాలను కనుల పండువగా ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని ఆలయాలలో ఉదయం 4 గంటలకు మూలవర్ల దర్శనం, 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు.

- కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వద్ద ఆర్చీని ఏర్పాటు చేశారు. క్యూలైన్లు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుద్దీపాల కటౌట్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి. జయనగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు. గడ్డిబజారు శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కూడా ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు.
- స్థానిక రవీంద్రనగర్‌లోని శ్రీ రామాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 6.30 గంటలకు పంచామృతాభిషేకం చేసి 8.30 గంటలకు అలంకార మండపంలో స్వామిని గరుడ వాహనంపై విష్ణుమూర్తిగా అలంకరించనున్నారు. అనంతరం షోడసోప చారాలు, పుష్పార్చన, నివేదన, దశహారతులు నిర్వహిస్తారు.
- హౌసింగ్‌బోర్డు రామాలయంలో కూడా ఉదయం 5 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనం ఉంటుంది. బీకేఎం వీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం, మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించనున్నారు. చిన్న బెస్తవీధిలోని బాలపోలేరమ్మ ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో గుర్తింపు



వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డిని సన్మానిస్తున్న మహిళా విభాగం నేతలు

కడప కార్పొరేషన్: కష్టపడి పనిచేసే వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నూతనంగా పదవి లభించిన సందర్భంగా మహిళా నేతలు, కార్యకర్తలు ఆయనకు శాలువాలు కప్పి, పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి శాయశక్తులా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి, తులశమ్మ, మల్లీశ్వరి, జ్యోతి, పద్మ, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా ఖజానా శాఖ డీడీ వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర డైరీని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. గురువారం స్థానిక జిల్లా ఖజానా కార్యాలయంలోని డీడీ ఛాంబర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఏడాది రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరీ తీసుకురావడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అహరోను , ఎస్‌టీవోలు రవి కుమార్, కేఎస్ అనిల్ కుమార్, ప్రభుదాస్, ఉదయ్ కుమార్, అసోసియేషన్ సెక్రటరీ సి. గంగన్న, కోశాధికారి సీఎస్ నరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షులు కేపీ సుహాసిని, పి. బాలచౌడన్న, జాయింట్ సెక్రటరీలు కె. వరప్రసాద్, డీవై ప్రేమలత, సుబ్బనరసయ్య పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మను కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను) పాలిటెక్నిక్ కడపలో గురువారం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మిర్జా విలాయత్ అలీ బేగ్, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ హాకీముద్దీన్, కన్వీనర్ ఖాజా మొయినుద్దీన్, అధ్యాపకులు సికందర్ హుస్సేన్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో..



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గరుడయ్య తదితరులు

కడప రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ను గురువారం కడప నగరంలోని యూనియన్ బ్యాంక్ కార్యాలయాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గరుడయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఐకమత్యంగా ఉండాలన్నారు. బ్యాంక్ అభివృద్ధికి, ఖాతాదారుల అభ్యున్నతికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రాష్ట్ర కమిటీ దృష్టికి తేవాలని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ టి వంశీకృష్ణ, సీడబ్ల్యూసీ సభ్యులు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయిబాబా హైస్కూల్, గురుకుల విద్యాపీఠ్ స్కూల్, నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్, నాగార్జున మోడల్ స్కూల్‌లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల, హరిదాసుల సందడి, భోగిళ్ల గొప్పదనాన్ని విద్యార్థులకు తెలియచేశారు. విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులతో వచ్చి అందరినీ అలరించారు. అనంతరం విద్యార్థులు గాలిపటాలను ఎగురవేశారు. రేగిపళ్ల స్నానాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా స్కూల్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి హాజరై సంక్రాంతి విశిష్టత గురించి పిల్లలకు వివరించి పిల్లలతో కలిసి సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా హైస్కూల్ సీఈఓ శ్రీదేవి, సీఈఓ సుధీర్‌కుమార్ రెడ్డి, నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, డైరెక్టర్ శ్రీదేవి, గురుకుల విద్యాపీఠ్ డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ వివేకానంద, ప్రిన్సిపాల్ మునిచంద్ర, నారాయణ పాఠశాల ఆర్ఐ రామకృష్ణశర్మ, ప్రిన్సిపాల్ కల్పన, కో ఆర్డినేటర్ వినోద్‌కుమార్, లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్ హెడ్ కోమటిరెడ్డి స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్/చింతకొమ్మదిన్నె: నగర శివార్లలోని 45వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలతో పాటు వివిధ రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థుల సంక్రాంతి సంబరాలకు సీపీఎం నాయకుడు పాపిరెడ్డి బహుమతులను అందించి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబ్బరత్నమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాయిబాబా స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



గురుకుల్ విద్యాపీఠ్‌లో...



నారాయణ పాఠశాలలో...



లిటిల్ మాస్టర్ ప్లే స్కూల్‌లో...



నాగార్జున పాఠశాలలో..



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

తిరుమల ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తిరుమల ఘటనలో భక్తులు ఆరు మంది చనిపోవడం జరిగిందని , ఘటనకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.సుందరరామరాజు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని ఓంశాంతి నగర్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా భక్తులను అనుమతించడం వల్లే ఘటన జరిగిందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అల్లు అర్జున్ సినిమా తొక్కిసలాటలో హీరో అరెస్టును ప్రభుత్వ చర్యలను సమర్థించారని మరి ఈఘటనలో చర్యలు తీసుకోవడంలో ఎందు నిర్లక్ష్యంగా ఉన్నారని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ రెడ్డి, విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శులు సుబ్బమ్మ, హిమబిందు, అరుణకుమారి, విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాదులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (అటానామస్) విద్యార్థులు విశాఖపట్నంలో జనవరి 2 నుండి జనవరి 6 వ తేదీ వరకు నిర్వహించిన అంతర్ జిల్లా యువ వినిమయ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారని కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఉత్సవంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మహేష్ (బీకాం 2వ సంవత్సరం), కాశీ (బిఎస్సీ 2వ సంవత్సరం), అశోక్ (బిఎస్సీ 2వ సంవత్సరం) పాల్గొని ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఈ విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అంకాల నాగరాజు, శివరామకృష్ణ, రమేష్ కుమార్ యాదవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ చార్జీలు తగ్గించుకునే అవకాశం



ఎస్‌వైహెచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కడప డివిజన్ ఈఈ హరిసేవ్యానాయక్

కడప కార్పొరేషన్: కడప నగరంలో నిర్మల నర్సింగ్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన ఎస్‌వైహెచ్ సోలార్స్ నూతన కార్యాలయాన్ని గురువారం ఏపీఎస్‌పీడీసీఎల్ కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.హరిసేవ్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని ఉపయోగించుకొని ప్రతి ఒక్కరూ తమ ఇంటికి సోలార్ బిగించుకొని 90% విద్యుత్ చార్జీలు తగ్గించుకోవాలన్నారు. ఇంటి పైకప్పు పైనే ఎవరికి కావలసిన విద్యుత్ వారే తయారు చేసుకునే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్‌వైహెచ్ సోలార్స్ అధినేత సిద్దవటం యానాదయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీతో పాటు పెట్టుబడిలో 90% బ్యాంకులు ఆర్థిక సహకారం తక్కువ వడ్డీతో అందిస్తాయన్నారు. ఈ సోలార్ ఏర్పాటు చేసుకున్నవారికి ఐదు సంవత్సరాల వరకు తమ సంస్థ ఉచిత సర్వీస్ అందిస్తుందని, ఒక్కసారి అమర్చుకొంటే 25 సంవత్సరాల వరకు ఎటువంటి ఖర్చు లేకుండా విద్యుత్ పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్ డీఎస్పీ అశోక్ రెడ్డి, కార్పొరేటర్లు మల్లికార్జున, సానపురెడ్డి శివకోటి రెడ్డి, నాయకులు బండి ప్రసాద్, ఓర్సు బాలకొండయ్య, ఆర్‌వీ రమణ , దస్తగిరి, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. వెంకటసుబ్బయ్య

కడప అర్బన్: ఆప్కాస్ ఉద్యోగులకు జీఓ నెం. 2 అమలు చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడపలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ కార్మికులను ఎంటీఎస్ విధానంలోకి మార్చాలన్నారు. గత ప్రభుత్వం పుణ్యమా అని 23 శాతం వేతనాలు పెరిగాయన్నారు. ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా ఆప్కాస్ కార్మికులకు మేలు జరగాలంటే ఎంటీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఆప్కాస్ యూనియన్ కోశాధికారి బాలాజీ రావు, ఉపాధ్యక్షులు భాస్కర్, ఏసన్న, కార్యదర్శులు కొండయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

వైవీయూకు కేరళ యూనివర్సిటీ విద్యార్థులు రాక



వైవీయు వీసీ, అధ్యాపకులతో కేరళ యూనివర్సిటీ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కేరళ సెంట్రల్ యూనివర్సిటీ ఎర్త్ సైన్స్ విద్యార్థులు కడప జిల్లాలో మైనింగ్ అధ్యయనం చేసేందుకు గురువారం వచ్చారు. విశ్వవిద్యాలయ ఎర్త్ సైన్స్ విభాగ సహకారంతో జిల్లాలో ఐదు రోజులపాటు మైనింగ్ ఉన్న ప్రాంతాలలో వారు అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ కె. కృష్ణారెడ్డి ఛాంబర్‌కు వచ్చి వారు కలిశారు. వీసీ మాట్లాడుతూ ఐదు రోజులపాటు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కేరళ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సిజన్ కుమార్, డాక్టర్ సందీప్‌లు మాట్లాడుతూ పర్యటన వివరాలు వివరించారు. ఈ బృందానికి సహకారం అందిస్తున్న వై వి యు ఎర్త్ సైన్స్ ప్రొఫెసర్ తుమ్మలకుంట శివ ప్రతాప్ మాట్లాడుతూ మైనింగ్, శిలలు, ఐరన్, యాస్బెస్టాస్, లైమ్ స్టోన్ అధ్యయనం చేసేలా చూస్తామన్నారు. ఇందులో భాగంగా వనిపెంట, పుష్పగిరిని సందర్శిస్తారని నిర్మాణాత్మకంగా మ్యాపింగ్ చేస్తారని వివరించారు.

రవీంద్రబాబుకు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్: వైవీయూ క్యాంపస్ పీజీ కళాశాల రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ జింక రవీంద్ర బాబుకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈయన కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఏ జీ దాము పర్యవేక్షణలో ×బయో గైడెడ్ ఐసోలేషన్ అండ్ సెమీ సింథసిస్ ఆఫ్ మల్టీ ఫంక్షనల్ ఫైటో కన్సిట్యూయన్స్:ఇమ్ప్లికేషన్ ఫర్ అల్జీమర్స్ డిసీస్ అండ్ డయాబెటిస్ డ్యూయల్ థెరఫ్టీ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వైవీయూకు సమర్పించారు. నిపుణుల బృందం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో రవీంద్రకు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు డాక్టరేట్ ప్రకటించారు.

రమేష్‌బాబుకు..



కడప ఎడ్యుకేషన్: ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ స్కాలర్ బొల్లా రమేష్ బాబుకు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈయన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ కిరణ్ పర్యవేక్షణలో × ఈ నావల్ సీఎస్మిక్ ఇమేజ్ సెగ్మెంటేషన్ యూజింగ్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్× అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని వైవీయుకు సమర్పించారు. నిపుణుల బృందం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉన్నట్లు నిర్ధారించారు. దీంతో రమేష్‌బాబుకు వైవీయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు డాక్టరేట్ ప్రకటించారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా డీఈఓగా మీనాక్షి విధుల్లో చేరినప్పటి నుంచి ఉపాధ్యాయులను, సిబ్బందిని అగౌరవపరుస్తూ మాట్లాడుతోందని, ఆమె వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆమె సస్పెండ్‌కు సిఫార్సు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని గురువారం కడపలో రాయలసీమ పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిలకు వేరువేరుగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు శామీర్, షంషేర్, హర్షవర్ధన్, సుదర్శన్, శివప్రసాద్, జగదీశ్వర్ రెడ్డి, ప్రవీణ్, శివ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవనభృతి పెంచాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేసి 1.9.2014కు ముందు రిటైర్డ్ అయిన కార్మికులకు జీవనభృతి రూ. 5 వేలకు పెంచాలని ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ సెక్రటరీ రఘునాథరెడ్డి కోరారు. గురువారం ఆయన కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు సూపర్‌లగ్జరీ సర్వీసుల్లో ప్రయాణించేందుకు 50 శాతం ఉన్న రాయితీని 75 శాతానికి పెంచాలని కోరారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చూడాలని ఆయన కోరారు.